సాక్షి
శ్రీకాకుళం
శనివారం ׀ 16 ׀ మార్చి ׀ 2024




తెలుసుకుందాం..

టెన్త్ పబ్లిక్ పరీక్షలపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. విద్యార్థులు గమనించాలి. - 8లో



దుర్గాలయంలో చోరీ

గార దుర్గాలయంలో చోరీ జరిగింది. అమ్మవారి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. - 8లో



న్యూస్‌రీల్

వైద్యులపై విచారణ

పొందూరు: స్థానిక సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్‌లపై ఆస్పత్రి వైద్యులు చేసిన ఫిర్యాదుపై శుక్రవారం ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎస్.కల్యాణచక్రవర్తి, రాజాం ఏరియా ఆస్పత్రి ఏఓ చంద్రశేఖర్‌లు విచారణ జరిపారు. ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రామదాసు, జూనియర్ అసిస్టెంట్ అనూషలు సమయపాలన పాటించడం లేదని, అవసరమైన పరికరాలు కొనుగోలు చేయలేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపారు. దీనికి సంబంధించి ఫిర్యాదు చేసిన వైద్యాధికారులు సుజాత, ప్రియాంక, ప్రతిభలతోను మాట్లాడారు. ఆస్పత్రి సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం వారి నుంచి లిఖిత పూర్వకంగా సమాధానం సేకరించారు. విచారణ నివేదికలను వైద్య శాఖ ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

డీఆర్‌ఓకు కృతజ్ఞతలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావుని గ్రేడ్-2 వీఆర్‌ఓల సంఘం ప్రతినిధులు శుక్రవారం ఆయన చాంబర్‌లో కలిసి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో గ్రేడ్-2 వీఆర్‌ఓలకు పదోన్నతులు కల్పించినందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు. చాలా కాలంగా జిల్లాలో 43 మంది గ్రామ రెవెన్యూ అధికారులు విధులు నిర్వహిస్తున్నా పదోన్నతులు లేవని, ఈ ప్రభుత్వం చొరవతో పదోన్నతులు వచ్చాయని వారు తెలిపారు. ఇందుకు సహకరించిన జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. డీఆర్‌ఓను కలిసిన వారిలో ఆ సంఘం నాయకులు అప్పలనాయుడు, భాస్కరరావు, లబ్బులు, రాంబాబు, సావిత్రి, దాసు, అప్పారావు, శాంతారావు తదితరులు ఉన్నారు.

ఇంక్యుబేషన్ కేంద్రం ప్రారంభం



ఇంక్యుబేషన్ కేంద్రం ప్రారంభిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ కేంద్రాన్ని శుక్రవారం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీతో ఒప్పందంలో భాగంగా ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయ్‌భాస్కర్, సీహెచ్ రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

'లీగల్ సెల్ సమావేశానికి హాజరుకండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ న్యాయ విభాగ సమావేశం ఈనెల 17న విశాఖపట్నంలో జరగనుందని, సమావేశానికి జిల్లాలో న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది పిట్టా దామోదరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం బార్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలోని ఉడా చిల్డ్రన్స్ థియేటర్, సిరిపురం జంక్షన్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, ఎం.మనోహర్ రెడ్డి, గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాస రావు, ఉత్తరాంధ్ర జిల్లాల మంత్రులు, శాసన సభ్యులు నాయకులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ లీగల్ సెల్ ప్రతినిధులు జి.దామోదరరావు, జీవీవీ గణపతి నాయుడు, కూన అన్నం నాయుడు, ఫల్గుణ రావు, అప్పలరాజు, రమేష్ పాల్గొన్నారు.

టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కవిటి: జిల్లాలో వివిధ మండలాల్లోని 145 పరీక్ష కేంద్రాల్లో ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన శుక్రవారం మండలంలోని బొరివంకలో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్షల కేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా 145 కేంద్రాల్లో 145 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 145 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించామన్నారు. వీటిలో ఏ సెంటర్లు 55, బి సెంటర్లు 28 కాగా సీ సెంటర్లు 62 ఉన్నాయని వివరించారు. గత ఏడాది సమస్యాత్మకంగా ఉన్న సెంటర్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. 1350 మంది వరకు ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్ పరీక్ష జరిగిన రోజు ఆ ఉపాధ్యాయుడు విధుల్లో లేకుండా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ధనంజయమజ్జి, హెచ్ఎం సనపల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

• పచ్చ పార్టీలో.. పొత్తు చిచ్చు!



భావోద్వేగంతో కంట తడి పెట్టుకున్న లక్ష్మీదేవి



అనుచరులతో తన ఇంటి వద్ద సమావేశమైన గుండ దంపతులు

- శ్రీకాకుళం సీటును బీజేపీకి కేటాయించినట్టుగా సంకేతాలు
- రోడ్డెక్కిన గుండ లక్ష్మీదేవి అనుచరులు
- ఎంపీ రామ్మోహన్ నాయుడు ఇంటి బయట ధర్నా, అర్ధనగ్న ప్రదర్శన
- భావోద్వేగానికి గురైన లక్ష్మీదేవి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

శ్రీకాకుళం టీడీపీలో కమలం ప్రమేయం కల్లోలం రేపుతోంది. జిల్లా కేంద్రం అసెంబ్లీ సీటు బీజేపీకి కేటాయిస్తున్నారనే సంకేతాలతో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వర్గం ఆందోళనకు దిగింది. లక్ష్మీదేవి అనుచరులు తీవ్ర ఆవేదనకులోనై ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఇంటిని ముట్టడించారు. అనంతరం ఆయన నివాసంలోకి వెళ్లేందుకు యత్నించారు. ఈ క్రమంలో వాచ్‌మెన్‌పై దాడి చేశారు. ఎంపీ లేరని తెలుసుకుని ఇంటి బయట బైఠాయించి, అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు ఆడుతున్న డ్రామాలో తాము బలైపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీకాకుళం టిక్కెట్ కోసం గుండ లక్ష్మీదేవి, గొండు శంకర్ పోటీ పడుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికీ ఈ రెండు వర్గాలు గొడవ పడుతున్నాయి. నువ్వెంత అంటే నువ్వెంత అని బాహాబాహీకి సైతం దిగాయి. ఇందులో గొండు శంకర్‌ను కింజరాపు ఫ్యామిలీ ప్రోత్సహిస్తోందని గుండ లక్ష్మీదేవి వర్గం తరుచూ ఆవేదన వ్యక్తం చేస్తోంది. అయినప్పటికీ సీటు వస్తుందన్న ఉద్దేశంతో లక్ష్మీదేవి పనిచేస్తూ వస్తున్నారు. ఆమెకు పోటీగా గొండు శంకర్ కూడా తగ్గేది లేదంటూ కాలు దువ్వుతున్నారు. లక్ష్మీదేవికే టిక్కెట్ అని ఒకవైపు, యూత్ కోటాలో శంకర్‌కు అని మరోవైపు ఆశలు కల్పించి చంద్రబాబు పబ్బం గడిపారు. చివరికి వచ్చేసరికి శ్రీకాకుళం సీటును బీజేపీకి కేటాయిస్తున్నారని సంకేతాలు పంపించారు. బీజేపీతో ఒప్పందం కూడా జరిగిపోయిందని, ఆ పార్టీ తరఫున రాయలసీమకు చెందిన సురేంద్రకుమార్ పోటీ చేస్తారని తొలుత, తర్వాత పైడి వేణుగోపాల్ పోటీ చేస్తారని తెరపైకి తెచ్చారు.



డ్రామానా.. చంద్రబాబు ఎత్తుగడా..!

సీటు బీజేపీకి కేటాయించేశారా? లేదంటే టీడీపీలో ఉన్న ఆశావహుల అభిప్రాయం తెలుసుకోవడానికి చంద్రబాబు అండ్‌కో డ్రామాలాడిందో తెలియదు గానీ శుక్రవారం సాయంత్రం అయ్యేసరికి గుండ లక్ష్మీదేవి వర్గం రోడ్డెక్కింది. టికెట్ కోసం తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. అధిష్టానంతో టచ్‌లో ఉండే ఎంపీ రామ్మోహన్‌నాయుడు వద్ద తేల్చుకోవాలని భావించారు. ఆమేరకు ఆమె వర్గీయులంతా 80అడుగుల రోడ్డులో ఉన్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు నివాసాన్ని ముట్టడించారు. తమకు అన్యాయం చేస్తున్నదంతా కింజరాపు ఫ్యామిలీ అన్నట్టుగా ఆందోళనకు దిగారు నిమిషాల్లోనే ఇంటిలోకి వెళ్లేందుకు యత్నించారు. అడ్డుకున్న వాచ్‌మెన్‌పై దాడి చేశారు. మొత్తానికి లోపలికి వెళ్లేసరికి ఎంపీ లేకపోవడంతో కార్యాలయం అసిస్టెంట్‌తో మాట్లాడారు. ఎంపీ ఇక్కడ లేరని చెప్పడంతో ఫోన్‌లోనే ఎంపీతో మాట్లాడారు. మీ ఆవేదన అర్థమైందని, రెండో జాబితాలో లక్ష్మీదేవి పేరు లేకపోవడం బాధాకరంగా ఉందని, తన వంతుగా ప్రయత్నిస్తానని ఫోన్‌లోనే ఎంపీ రక్తి కట్టించారు. అయినప్పటికీ శాంతించలేదు. ఇదంతా ఎంపీ రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు ఆడుతున్న డ్రామా అని బయటికొచ్చి బైఠాయించారు. అక్కడే అర్ధనగ్న ప్రదర్శన చేశారు. టైర్లు కూడా కాల్చుదామని వెంట పట్టుకుని వచ్చారు. ఎంత చేసినా ఫలితం కనిపించకపోవడంతో ఆందోళనకారులంతా గుండ లక్ష్మీదేవి ఇంటికి వెళ్లి సమావేశమయ్యారు.

ఎంపీ ఇంటి దగ్గర జరిగిన ఎపిసోడ్‌ను అప్పల సూర్యనారాయణ, లక్ష్మీదేవి దంపతులకు వివరించారు. ఎంపీ చెప్పిన విషయాలను తెలియజేశారు. ఈ క్రమంలో కొందరు జోక్యం చేసుకుని అదంతా డ్రామాయేనని, రెండు జాబితాల్లోనూ పేరు లేదనే విషయం ఎంపీకీ తెలియదా... బాబాయ్, అబ్బాయ్ కలిసి తమను తొక్కేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం లోగా లక్ష్మీదేవి పేరు రాకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని, ఆత్మహత్యలకు సైతం సిద్ధపడతామంటూ హెచ్చరించారు. ఈ సందర్భంగా అప్పల సూర్యనారాయణ మాట్లాడుతూ అనాదిగా తమను తొక్కేస్తున్నారని, గత ఏడాదికి పైగా వర్గపోరు నడుస్తోందని చెప్పినా, అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. సీనియర్‌నైన తనకు అన్యాయం చేస్తున్నారని బాధపడ్డారు. వ్యక్తిగతంగా ఇష్టంలేకపోయినా అచ్చెన్నాయుడ్ని లక్ష్మీదేవి కలిసి మొర పెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. కంటతడి కూడా పెట్టారు. మొత్తానికి టీడీపీలో ప్రస్తుతం జరుగుతున్నది డ్రామానా? చంద్రబాబు వేసిన ఎత్తుగడా అన్నది త్వరలోనే తేలనుంది.

జోరుగా ఉపాధి



పనులు చేస్తున్న ఉపాధి వేతనదారులు

- ఊరూరా ఉపాధి పనులు
- ఎక్కువ కుటుంబాలకు పని కల్పన
- సగటున రోజుకి రూ.252 వేతనం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఊరూరా జోరుగా ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో ఈ పనులు వేగవంతం చేస్తున్నారు. ఏటా ఉపాధి హామీ పనుల్లో జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ ఏడాది కూడా నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తూ జిల్లాలో పనులు చేస్తున్నారు. జిల్లాలో 30 మండలాలు ఉన్నాయి. అన్ని మండలాల్లో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. జిల్లాలో 912 పంచాయతీలు ఉండగా, వీటిలో 804 పంచాయతీల్లో పనులు నిర్వహిస్తున్నారు. రోజుకి సగటున 96 వేల నుంచి లక్ష మంది వరకు వేతనదారులు పనుల్లో పాల్గొంటున్నారు.

వంద రోజులు పని

వేతనదారులకు వంద రోజులు పని కల్పించాలని ప్రభుత్వం పదే పదే చెబుతోంది. ఈ విషయంలో జిల్లా ముందంజలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 52,959 కుటుంబాలకు వంద రోజులు పని కల్పించారు. అలాగే పనిదినాల కల్పనలోనూ జిల్లా అగ్రశ్రేణిలో కొనసాగుతోంది. ఈ ఏడాది 1,98,76,117 దినాలు పనిని కల్పించారు. ఈ రెండు అంశాల్లోనూ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో జిల్లా ఉంది. ఉపాధి పనులు చేస్తున్న వారికి సగటున వేతనం రూ. 252.10 వరకు గిట్టుబాటు అవుతోంది. ఈ విషయంలో మన జిల్లా 11వ స్థానంలో ఉంది. తొలిస్థానంలో కోనసీమ జిల్లాలో రోజుకు రూ. 266లు వేతనం అందుతోంది.

దండిగా నిధులు

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు వేతనాల రూపంలో ఖర్చు చేసింది రూ. 500.51 కోట్లు. ఈ పనుల వల్ల మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ. 333.68 కోట్లు సమకూరాయి. ఇందులో వివిధ పనుల రూపంలో రూ.132.50 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా ఈ ఏడాది జనరేట్ అయిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ. 201.19 కోట్లు ఉన్నాయి. వీటిని ఖర్చు చేయాల్సి ఉంది. ఉపాధి హామీ పనుల్లో 2.16 కోట్ల పని దినాలు లక్ష్యంగా కాగా ఇప్పటివరకు 1.99 కోట్ల పని దినాలు పూర్తి చేశారు. మరో 20 రోజులు గడువు ఉండడంతో పూర్తిస్థాయి లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉంది.

లక్ష్యాలు అధిగమిస్తాం..



ఈ ఏడాది ఉపాధి పనులు జోరుగా జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సకాలంలో అధిగమిస్తాం. ఇప్పటికే జిల్లాలో వేతన, మెటీరియల్ కాంపోనెంట్ రూపంలో రూ.611.97 కోట్లు వరకు జనరేట్ అయ్యాయి. ఇంకా 20 రోజులు గడువు ఉంది. మరింత నిధులు జనరేట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

– జీవీ చిట్టిరాజు, డ్వామా పీడీ

గ్రూప్–1 పరీక్షకు సన్నద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

- 17న గ్రూప్–1 పరీక్ష
- జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 6,404 మంది అభ్యర్థులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్, పరీక్షల సమన్వయాధికారి ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై ఆయన శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా నిర్వహించాలన్నారు. దిశా డీఎస్పీ ఆర్.శ్రీనివాస రావు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాట్లపై వివరించారు. ఈ పరీక్షలకు 6,404 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. మొత్తం 18 పరీక్ష కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి లైజన్ ఆఫీసర్ నియమించారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరుగుతుంది. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా దూర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి ఏర్పాట్లు చేసుకోవాలని, సిట్టింగ్ ఏర్పాట్లను ముందుగానే చూసుకోవాలని తెలిపారు. ఏపీపీఎస్సీ నుంచి సహాయ కార్యదర్శి సురేష్ బాబు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లకు అనుమతి ఉండదన్నారు. పరీక్ష నిర్వహణకు తీసుకోవాల్సిన అంశాలు వివరించారు.

సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, జిల్లా అధికారులు ఏపీసీ జయ ప్రకాష్, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట రావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, డీపీఓ వెంకటేశ్వరులు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీనివాస రావు, సూపరింటెండెంట్ రామారావు, క్రాంతి తదితర అధికారులు, ఆయా కళాశాలల, పాఠశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు చీఫ్ సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదులపై తక్షణ చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల సమయంలో ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ సూచించారు. ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎన్నికల కంట్రోల్ రూమ్ నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా ఆచరించాలని సూచించారు. ఎన్నికల విధులకు సంబంధించి ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. విధుల నిర్వహణకు సంబంధించి ఏమైనా అనుమానాలు ఉంటే అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఫిర్యాదులు సత్వరం పరిష్కరించేలా సత్వర చర్యలు చేపట్టాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే నకిలీ వార్తలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. సి విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులపై తక్షణ చర్యలు ఉండాలన్నారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్, ఈ మెయిల్ వివరాలు అందరికీ తెలియజేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ఎంసీ ఎంసీ, సీ విజిల్, అకౌంటింగ్, సామాజిక మాధ్యమాలు, టెలికాం ఆపరేటర్, ఫిర్యాదులు తదితర కంట్రోల్ రూమ్ బృందాలకు పలు అంశాలపై సూచనలు చేశారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో మొత్తం 11 మందిపై మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు



పరీక్ష కేంద్రం నుంచి ఆనందంతో బయటకు వస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. మార్చి 1వ తేదీన జిల్లాలో 83 కేంద్రాల్లో మొదలైన ప్రధాన పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఒకటి రెండు కేంద్రాల్లో ఒకేషనల్/బ్రిడ్జ్ కోర్సుల పేపర్లకు మినహా మిగిలిన పరీక్షలన్నీ ముగిసినట్టే. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ముఖ్యంగా పరీక్షలు సాఫీగా ముగియడానికి సహకరించిన వారందరికీ జిల్లా స్పెషల్ ఆఫీసర్/డీవీఈవో కోట ప్రకాశరావు, జిల్లా ఆర్ఐవో ప్రగడ దుర్గారావు కృతజ్ఞతలు తెలిపారు.

సమన్వయంతో మెప్పించిన డీఈసీ కమిటీ..

మరోపక్క, డీఈఓ కన్వీనర్‌గా ఆర్ఐవో దుర్గారావు నేతృత్వంలో డీఈసీ కమిటీ సభ్యులు బొమ్మలాట శ్యామ్‌సుందర్ (ప్రిన్సిపాల్-ఆమదాలవలస), గూణ సింహాచలం(ప్రిన్సిపాల్-రణస్థలం), కీర్తి తవిటినాయుడు (ప్రిన్సిపాల్-కొయ్యాం), బెండి రామచంద్రరావు (ఒకేషనల్ లెక్చరర్-శ్రీకాకుళం బాలురు, డీఈసీ4)లు సమన్వయంతో పనిచేసి మెప్పించారు. అతిసున్నితమైన సమస్యలను, గ్రీవెన్స్‌లను సునాయాసంగా పరిష్కరించి శభాష్ అనిపించారు. రాష్ట్ర, జిల్లా అధికారుల ప్రశంసలు అందుకున్నారు.

11 మంది డీబార్

జిల్లాలో సమస్యాత్మక, కాపీయింగ్‌కు ఆస్కారం ఉన్న కేంద్రాల్లో అధికారులు, తనిఖీ బృందాలు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ వచ్చారు. జిల్లా ఆర్ఐఓ కార్యాలయంలో డెకెన్ పేరిట ఏర్పాటు చేసిన కమాండింగ్ కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు పర్యవేక్షించారు. ఇదే క్రమంలో జిల్లాలో మాల్‌ప్రాక్టీసుకు పాల్పడుతున్న 11 మంది విద్యార్థులను డీబార్ చేశారు. వీరిపై మాల్‌ప్రాక్టీసు కేసులను నమోదు చేశారు. ఆఖరి రోజు 83 కేంద్రాల్లో 911 మంది గైర్హాజరయ్యారు. సెట్-2 ప్రశ్న పత్రంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కెమిస్ట్రీ, కామర్స్ పేపర్లకు పరీక్ష రాశారు. జనరల్ విభాగంలో 18016 మందికి 854 మంది, ఒకేషనల్ విభాగంలో 692 మందికి 57 మంది గైర్హాజర్యారు. ప్రభుత్వ ఆదేశాలతో మొదటిసారిగా అందుబాటులో ఉన్న సాంకేతికతను ఇంటర్‌బోర్డు అందిపుచ్చుకుంది. పరీక్షలు ముగియడంతో వసతి గృహాలు, హాస్టల్స్ విద్యార్థులు ఇంటి బాట పట్టారు.

25 కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 25 కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఈ నెల 21న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16 విభాగాలకు సంబంధించి నియామకాలు చేపడుతున్నట్లు చెప్పారు. నేరుగా విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాల్సి ఉంటుందని అన్నారు. పూర్తి సమాచారం కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. బీఆర్‌ఏయూ.ఈడీయు.ఐఎన్ వెబ్‌సైట్‌లో పొందు పర్చినట్లు చెప్పారు. ఎకనామిక్స్‌లో ఒకటి, ఎడ్యుకేషన్ మెంటల్లీ రిటార్డ్‌లో ఒకటి, జర్నలిజం మాస్‌కమ్యూనికేషన్‌లో రెండు, లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో ఒకటి, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఒకటి, యోగా ఫిట్ నెస్ మేనేజ్‌మెంట్‌లో రెండు, ఫిజిక్స్‌లో నాలుగు, సివిల్ ఇంజినీరింగ్‌లో రెండు, కంప్యూటర్ సైన్స్‌లో రెండు, ట్రిపుల్‌ఈలో ఒకటి, సీఎస్‌ఈలో ఒకటి, మెకానికల్‌లో ఒకటి భర్తీ చేయనున్నట్లు చెప్పారు.



పసుపు కుంకుమ పంచిపెడుతున్న మహిళలు



హోలీ ఆటలతో సందడి చేస్తున్న యువకులు

• పెళ్లి సందడి

సువ్వలరేవులో సామూహిక వివాహాల సందడి శుక్రవారం ప్రారంభమైంది. వివాహ వేడుకల్లో భాగంగా యువతీ యువకులు, చిన్నారులు, పెద్దలు శుక్రవారం హోలీ ఆడారు. పెళ్లి తంతులో మొదటి ఘట్టంగా పెళ్లి మండపం రూపంలో వాకిలిని అలంకరించి మట్టి కుండలకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ముత్తైదువులకు కూడా ఆహ్వానం పలికారు. వివాహ వేడుకలతో సువ్వలరేవు గ్రామం సందడిగా మారింది. శనివారం అర్ధరాత్రి 1.55 నిమిషాలకు మాంగళ్యధారణ చేసేందుకు పెద్దలు నిర్ణయించారు.

– వజ్రపుకొత్తూరు రూరల్



పెళ్లి తంతులో భాగంగా మట్టి కుండలకు పూజలు

పాత నేరస్తుడు అరెస్టు

ఆమదాలవలస: గంజాయి అక్రమ రవాణా కేసులో మూడేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న పాత నేరస్తుడు బూడిద రాజు అలియాస్ మచ్చ రాజును స్థానిక వన్‌వే వద్ద అరెస్టు చేసినట్లు ఆమదాలవలస సీఐ దివాకర్‌వాయునందన్ తెలిపారు. అతనిది అల్లూరి సీతారామరాజు జిల్లా, పెదబయలు మండలం, కించురాపల్లి గ్రామం. గత మూడేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తుడు ఆమదాలవలసలో సంచరిస్తున్నాడన్న సమాచారం తెలియడంతో పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిపారు. అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ టీఏకు గుర్తింపుపై హర్షం

వజ్రపుకొత్తూరు: వైఎస్సార్‌టీఏకు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు దక్కడంపై అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తమ్మినేని చందన రావు, జిల్లా అధ్యక్షుడు మజ్జి చినబాబు శుక్ర వారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 14న గుర్తింపునిస్తూ జీఓ నంబర్ 32ను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సంఘం గుర్తింపునకు ఆమోదం తెలిపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సంఘం అభివృద్ధికి సహక రించిన ఎంపీ వి.విజయసాయిరెడ్డి, సంఘం గుర్తింపునకు కృషి చేసిన శాసన మండలి సభ్యులు టి.కల్పలత, పి.చంద్రశేఖరరెడ్డి, రామచంద్రారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జాలి రెడ్డి అశోక్‌రెడ్డి, గెడ్డం సుధీర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల బందోబస్తుకు సిద్ధం



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసులు ఎన్నికల బందోబస్తు విధులకు సిద్ధం కావాలని ఎస్పీ జీఆర్ రాధిక పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో శుక్రవారం పోలీసులు నిర్వహించిన ప్రత్యేక పరేడ్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వృత్తి నైపుణ్యం మెరుగుకు పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ బ్యాండ్ సిబ్బందికి యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు వై.శృతి, ఆర్.శ్రీనివాసరావు, ఎల్.శేషాద్రి నాయుడు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆడిటర్ తమ్మన



తమ్మన భాస్కర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలెప్‌మెంట్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆడిటర్ తమ్మన భాస్కర్‌ను ప్రభుత్వం నియమించింది. సంఘంలో మంచి గుర్తింపు ఉండి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ పదవులు నిర్వహిస్తున్న తమ్మన భాస్కర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులవ్వడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. భాస్కర్ ప్రస్తుతం ఏపీ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషిచేస్తానని, సమాజ హితంతో పాటు జాతి ప్రయోజనాన్ని సమన్వయం చేసుకుంటానన్నారు. తనకి ఈ గౌరవం దక్కడంలో కృషి చేసిన మంత్రి ధర్మాన ప్రసాదరావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎంఎస్ఎస్ గుప్తా, సంఘ పెద్దలు మండవిల్లి రవి, బలభద్రుని సత్య, పేర్ల సురేష్, వీఎస్ఎన్ఎల్ నరసింహం మండవిల్లి మల్లికార్జునరావు, పేర్ల మహేష్, తమ్మన వల్లభ సత్యనారాయణ, ఆత్మకూరు రామకృష్ణ, చెబోలు విశ్వేశ్వరరావు, బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.


అండర్‌పాస్‌వే నిర్మాణం పూర్తి



నీలమణిదుర్గ ఆలయం ముందు ఫ్లై ఓవర్, అండర్ పాస్ వే పూర్తయిన దృశ్యం

పాతపట్నం: పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఆలయం కూడలిలో హైవే ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా అండర్ పాస్‌వే నిర్మాణం పూర్తి చేశారు. టెక్కలి రోడ్డు నుంచి వచ్చే వాహనాలు రాకపోకలకు ఫ్లై ఓవర్ కింద పాస్‌వేను ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల్లో పాతపట్నం నుంచి నేరుగా టెక్కలి, కొరసవాడ నుంచి టెక్కలి వైపు వెళ్లడానికి అండర్ పాస్‌వే ఉపయోగపడుతుందని, అలాగే రైల్వే ట్రాక్ వద్ద కూడా అండర్ పాస్‌వే ఏర్పాటు చేయనున్నామని హైవే డీఈఈ నజీర్ తెలిపారు.

96 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు



పట్టుకొన్న ఒడిశా మద్యంను ప్రదర్శించిన కొత్తూరు పోలీసులు

కొత్తూరు: మండలంలోని కౌశల్యాపురం గ్రామం వద్ద శుక్రవారం స్థానిక ఎస్‌ఐ ఎంఏ అహ్మద్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మండలంలోని కడుము గ్రామానికి చెందిన లెంక ఫల్గుణరావు ద్విచక్ర వాహనంపై ఒడిశాకు చెందిన 96 మద్యం బాటిళ్లు తీసుకువస్తుండగా పట్టుబడినట్లు ఎస్‌ఐ చెప్పారు. మద్యం, బైక్‌ను సీజ్ చేసి ఫల్గుణరావుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.



ఎల్.ఎన్.పేట: సీఎం జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, మహిళలు

ఆత్మీయ అభిషేకాలు

సాయం అందుకున్న అక్కచెల్లెమ్మల సంతోషానికి సాక్షిగా చేయూత సంబరాలు హుషారుగా జరుగుతున్నాయి. జిల్లాలోని ఆమదాలవలసలోని మార్కెట్ యార్డు ఆవరణలో స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యంలో, అలాగే మెళియాపుట్టిలోని దుక్కరాజన్నరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ, ఎల్ఎన్‌పేటలోని కోవిలాం కాలనీ వద్ద ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు జరిగాయి.



ఆమదాలవలస రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

తెలుసుకుందాం..
తెలివిగా నడుచుకుందాం

- 18 నుంచి 30 వరకు టెన్త్ పబ్లిక్ పరీక్షలు
- ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం
- 145 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 30,574 మంది విద్యార్థులు
- విద్యార్థుల్లో సందేహాల నివృత్తికి చర్యలు



టెన్త్‌పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయం ఆసన్నమైంది. 18 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. టెన్త్ విద్యార్థులు తొలిసారిగా పబ్లిక్ పరీక్షలను రాయబోతున్నారు. వారు చదువుతున్న పాఠశాలలో కాకుండా, కాస్త దూరంగా కొత్తగా కేటాయించిన పరీక్ష కేంద్రానికి వెళ్లి, పరీక్ష రాయాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థుల్లో ఎన్నో సందేహాలు, ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల విద్య ప్రభుత్వ పరీక్షల విభాగం విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలతో కూడిన నియమావళిని హాల్‌టికెట్లపై ముద్రించింది. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న టెన్త్‌క్లాస్ పరీక్షలకు పునర్విభజన శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా హాజరు కానున్న 30574 మంది విద్యార్థుల కోసం 145 కేంద్రాలను సిద్ధం చేశారు. హాల్ టికెట్లను ప్రభుత్వం ఇప్పటికే వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉంచింది. వీటిని అందుకున్న విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలను తమ తల్లిదండ్రులతోపాటు ఒకసారి సందర్శించడం ఉత్తమమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఈ సూచనలు పాటించండి

- మొత్తం ఏడు రోజులపాటు జరిగే ఈ పరీక్షలకు ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకల్లా కచ్చితంగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.
- ప్రతిరోజు ఉదయం 8.45 నుంచి 9.30 వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 9.30కు గేట్లు మూసి వేసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.
- తమ హాల్ టికెట్లు పొందిన విద్యార్థులు దానిపై ముద్రించిన తమ వివరాలు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, రాయాల్సిన సబ్జెక్టులు, పరీక్ష కేంద్రం పేరు, చిరునామా సరి చూసుకోవాలి. వాటిలో ఏమైనా తప్పులు ఉంటే ముందుగానే తాము చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం దృష్టికి తీసుకెళ్లి, సరి చేయించుకోవాలి.



- ప్రశ్న పత్రాలపై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్ ముద్రిస్తారు. హాల్ టిక్కెట్స్‌పై ఉన్న ఎన్‌రోల్‌మెంట్ నంబరు ఆధారంగా.. వారికి కేటాయించిన రూములవారీగా విద్యార్థులను కూర్చోబెడతారు. బార్ కోడింగ్ విధానంలో రూపొందించిన ఓఎంఆర్ షీట్లను విద్యార్థుల రోల్ నంబరు ఆధారంగా ఇన్విజిలేటర్ పంపిణీ చేస్తారు.
- విద్యార్థి రోల్ నంబరు ఆధారంగా ఆ విద్యార్థి తనకు కేటాయించిన సీట్‌లో కూర్చున్న తర్వాత ఇన్విజిలేటర్ వచ్చి బార్ కోడింగ్‌తో కూడిన ఓఎంఆర్ షీట్, ప్రశ్న పత్రం, ఆన్సర్ బుక్‌లెట్ అందజేస్తారు. తదుపరి ఓఎంఆర్ షీట్ పూరించే విధానంపై ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా పూరించాలి. దానిపై అనవసరమైన గీతలు, రాతలు రాయరాదు.
- పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన తర్వాత, మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగిసేవరకు విద్యార్థులను బయటకు వెళ్లనివ్వరు. గుర్తింపు కార్డు కలిగి, పరీక్షల విధుల్లో ఉన్న రాష్ట్ర పరిశీలకులు, జిల్లా అధికారులు, స్క్వాడ్ బృందాల వారు పరీక్ష కేంద్రాల్లోకి ఆకస్మిక తనిఖీలకు వస్తుంటారు.

వదంతులు నమ్మవద్దు..

- టెన్త్ ప్రశ్న పత్రం లీకేజీ అయ్యిందని, పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిందని కొందరు పనిగట్టుకుని చేసే ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మ కూడదు. విద్యార్థులు పరీక్షలకు ప్రశాంతంగా హాజరుకావాలి. ఒక వేళ ఏదైనా సెంటర్ నుంచి ప్రశ్న పత్రం లీకేజీకి గురైతే.. అది ఎక్కడ జరిగిందో గుర్తించే సాంకేతిక విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.
- ప్రశ్న పత్రంపై మొదటిసారి బార్‌కోడ్, స్కానర్ క్యూఆర్ కోడ్‌తో ప్రింట్ చేస్తున్నారు. ఒకవేళ సెల్‌ఫోన్‌లో ఫొటో తీస్తే పరీక్షల విభాగం సాంకేతిక విభాగానికి వెంటనే తెలిసిపోతుంది.
- పరీక్ష కేంద్రంలో పక్క, పక్కన కూర్చునే ఏ ఇద్దరు విద్యార్థులకు ఇచ్చే ప్రశ్న పత్రంలో ప్రశ్నలు ఒకే వరుస క్రమంలో ఉండవు. విద్యార్థులు పక్కవారి పేజీలను చూసి సమాధానాలు రాయాలనే ఆలోచన వీడాలి. కాపీయింగ్‌కు పాల్పడినా, జేబుల్లో స్లిప్పులు పెట్టుకుని వచ్చినా, పరీక్ష కేంద్రంలో పోలీసులు, పాఠశాల సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపిస్తారు. పరీక్ష రాసే సమయంలో ఏ విద్యార్థి వద్ద అయినా స్లిప్పులు కనిపిస్తే పరీక్షల నుంచి డీబార్ చేస్తారు.
- తాజా నిబంధనల ప్రకారం ఇన్విజిలేటర్లతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, డీఓల వద్ద సైతం సెల్‌ఫోన్లు ఉండేందుకు అనుమతి లేదు. నో సెల్‌ఫోన్ జోన్‌లగా పరీక్ష కేంద్రాలను ప్రకటించారు.

‘అభివృద్ధి చేశాం.. ఆదరించండి’



పెద్దలక్ష్మీపురంలో మాట్లాడుతున్న పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: ప్రతి పల్లెను అభివృద్ధి చేయడంతో పాటు ప్రతి గడపకు సంక్షేమాన్ని అందించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని ఆదరించాలని జెడ్పీ చైర్ పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. శుక్రవారం ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామం పెద్దలక్ష్మీపురంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.5లక్షలతో నిర్మించి శుద్ధజల ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం అదే గ్రామంలో జెడ్పీ నిధులు రూ.5లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దశాబ్దాల నుంచి తీరప్రాంతంలోని ప్రజలు సముద్రతీరంలోని చలమ నీటినే తాగునీటిగా ఉపయోగించేవారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలో ప్రజల దాహార్తి తీర్చామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర రావు, జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, సర్పంచ్ బుడ్డ కళ్యాణ్, పులకల డొంబురు, కీలు ఉమాశంకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

‘ఎన్నికల నియమావళి అమలుచేయాలి’

శ్రీకాకుళం పాతబస్టాండు : సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే విధిగా నియమావళిని అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జేసీ ఎం.నవీన్, అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్‌తో కలిసి ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీసు అధికారులతో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో 3,810 వరకు ప్రభుత్వ కార్యాలయాలు గుర్తించామని, షెడ్యూల్ విడుదలైన వెంటనే కార్యాలయాల్లో ప్రభుత్వ అభివృద్ధికి సంబంధించి ఫొటోలు, బ్యానర్లు తొలగించాలని, బహిరంగ ప్రదేశాల్లో ప్రచార సామగ్రి, హోర్డింగ్‌లను 48 గంటల్లో తీసేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, ఎస్ఎస్‌టీ పనిచేయాలని, సరిహద్దు చెక్‌పోస్టులతో సహా అన్ని ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీలు వీడియో కవరేజీ చేయించాలన్నారు. జిల్లాకేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని దానితో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి నిత్యం జరిగే సంఘటనలకు సంబంధించి నివేదికలివ్వాలని, నగదు తరలింపు, మద్యం పంపిణీ, రాజకీయ సమావేశాలు, ర్యాలీలు, ఇతర కార్యకలాపాలపై సంబంధిత టీం సభ్యుల నిఘా ఉండాలన్నారు. సువిధ యాప్ ఉపయోగించి సులువుగా వారికి కావాల్సిన పర్మిషన్లు పొందవచ్చన్నారు. జాయింట్ కలెక్టర్ నవీన్ మాట్లాడుతూ అధికారులంతా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించినా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి, నోడల్ అధికారులు, డ్వామా పీడీ చిట్టిరాజు, డీఆర్డీ పీడీ కిరణ్ కుమార్, డీఎస్‌ఓ శాంతిశ్రీ, జిల్లా పరిషత్ సీఈవో వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, వివిధ బృందాలకు సంబంధించిన సభ్యులు పాల్గొన్నారు.

గార దుర్గాలయంలో చోరీ



దుర్గాలయంలో క్లూస్ టీం వివరాలు సేకరిస్తున్న దృశ్యం

గార: మండల కేంద్రంలోని దుర్గాలయంలో గురువారం రాత్రి దొంగలు పడి అమ్మవారి నగలు, హుండీని ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం పూజారి ఆలయం తెరిచేందుకు వెళ్లే సరికి తలుపులు తీసి ఉండటంతో ధర్మకర్త మార్పు ధర్మారావు వచ్చి ఉంటారని భావించారు. తీరా గర్భగుడి వద్దకు వెళ్లేసరికి అమ్మవారికి అలంకరించిన నగలు లేకపోవడంతో వెంటనే ధర్మకర్తకు విషయం తెలియజేశారు. ఆయన పోలీసులకు సమాచారం అందించగా క్లూస్‌టీం రంగంలోకి దిగి వివరాలు సేకరించింది. అమ్మవారి నుదుట బంగారం బొట్టు, చెవి దుద్దులు, మంగళసూత్రం వంటి బంగారం వస్తువులు సుమారు 4 తులాలు, వెండి కంఠాభరణం, వెండి వడ్డానం, ఉద్ధరిణి పాత్ర వంటి వెండి వస్తువులు సుమారు కిలో వరకు పోయినట్టు గుర్తించారు. సమీపంలో హుండీ పగలగొట్టి ఉన్నట్టు పోలీసులు కనుగొన్నారు.

పెట్రోలు బంకు వెనుక వైపు మిల్లు కార్యాలయం తాళాలు పగలగొట్టారు. గత ఏడాది దుర్గాలయంలో చోరీ జరిగి సుమారు రూ.8 లక్షలు విలువ చేసే వస్తువులు దొంగలు ఎత్తుకెళ్లారు. మార్పు ధర్మారావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఎంపీపీ గొండు రఘురామ్, ముంజేటి కృష్ణమూర్తి, ఆరంగి రమణమూర్తి తదితరులు పరిశీలించారు.

వ్యక్తి దారుణ హత్య

- సొండిపూడిలో ఘటన
- సొంత అన్నపైనే అనుమానం



నీలాద్రి (ఫైల్)

మందస: మందస మండలంలోని సొండిపూడి గ్రామంలో శుక్రవారం రాత్రి దారుణ హత్య జరిగింది. ఈ హత్యలో అతని అన్నపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. సొండిపూడిలో లైశెట్టి కుమార్, నీలాద్రి అనియాస్ ప్రకాశరావు (34) అనే అన్నదమ్ములు తల్లి లక్ష్మీబాయి వద్ద ఉంటున్నారు. ఇద్దరూ తాగుడుకు బానిసలు. తరచూ కొట్టుకునేవారు. ఇద్దరి మధ్య ఎప్పుడూ గొడవలు జరుగుతుండేవి. ఒకసారి గునపాలతో కూడా పొడు చుకున్నారు. ఈ నేపథ్యంలో నీలాద్రి గ్రామం నుంచి బయటకు వెళ్లిపోయి ఇటీవలే తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. సొండిపూడిలో శుక్రవారం ఓ పెళ్లి జరుగుతుండగా.. నీలాద్రి ఇంటిలో నిద్రిస్తున్నాడు. రాత్రి 8.30 గంటల సమయంలో తల్లి వచ్చి చూసేసరికి అతను అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే ఆమె బంధువులకు విషయం చెప్పారు. స్థానికులు వచ్చి చూసి నీలాద్రి మరణించినట్టు గుర్తించారు. తలపై కర్రతో మోది చంపినట్టు గుర్తించారు. రక్తాన్ని కడిగి, సంఘటనా స్థలాన్ని క్లీన్ చేయడంతో ముందు హత్యగా నిర్ధారించలేకపోయారు. క్షుణ్ణంగా పరిశీలించగా, తలపై గాయాలు ఉండడంతో హత్యగా గుర్తించి, మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ పి.ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎస్‌ఐ సీహెచ్ రామారావు(వజ్రపుకొత్తూరు) సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ ఉదంతంలో అందరూ మృతుడి అన్న కుమార్‌పైనే అనుమానాలు వ్యక్తం చేయడం గమనార్హం.

తేనెటీగల దాడిలో వ్యక్తికి గాయాలు

సారవకోట: మండలంలోని బురుజువాడ గ్రామంలో శుక్రవారం తేనెటీగల దాడిలో జగన్నాథపురం గ్రామానికి చెందిన పెద్దింటి ఆదినారాయణ గాయాలపాలయ్యాడు. బురుజువాడ గ్రామంలోని తేనె పట్టు తీసేందుకు చెట్టు ఎక్కగా అక్కడున్న తేనెటీగలు దాడి చేసి గాయపర్చాయి. మంటతో ఉన్న కర్రను పట్టుకుని చెట్టు ఎక్కి తేనె పట్టు తొలగించేందుకు ప్రయత్నించే సమయంలో మంటతో ఉన్న కర్ర పక్కనున్న గడ్డి, ఆకులపై పడటంతో మంటలు రేగి పలు చెట్లు కాలిపోయాయి. వెంటనే స్థానికులు స్పందించి మంటలను అదుపు చేశారు.

‘హక్కులపై అవగాహన అవసరం’



వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి చిరంజీవి

శ్రీకాకుళం పాతబస్టాండ్: వినియోగదారుల చట్టంపై అవగాహన ఉంటే స్వచ్ఛమైన ఆర్థిక సమాజం సాధ్యమవుతుందని వినియోగదారుల వ్యవహారాల కమిషన్ న్యాయమూర్తి రఘుపాత్రుని చిరంజీవి అన్నారు. పౌర సరఫరాలు, సంబంధిత శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధ్యక్షత వహించారు. వినియోగదారుల వ్యవహారాల కమిషన్ న్యాయమూర్తి రఘుపాత్రుని చిరంజీవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుపైనా అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం సమాఖ్య అధ్యక్షుడు న్యాయవాది బగాది రామ్మోహన్ రావు, జిల్లా సరఫరాల అధికారి శాంతిశ్రీ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాస రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, సెట్ శ్రీ ముఖ్యకార్య నిర్వహణాధికారి బీవీ ప్రసాదరావు, ఇతర శాఖల అధికారులు, ఫోరం సభ్యులు రాధా రాణి, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా ‘కె.మత్స్యలేశం ప్రభుత్వ పాఠశాల’



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏఎంఓ లక్ష్మీనారాయణ

గార: మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా ఎంపికైన కె.మత్స్యలేశం ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా మానిటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక పాఠశాలలో సర్పంచ్ బి.లలిత అధ్యక్షతన శుక్రవారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో 40 మోడల్ ఫౌండేషన్ స్కూల్స్‌ను ఎంపిక చేయగా జిల్లాలో కె.మత్స్యలేశంలోని యూపీ పాఠశాల, కొత్తూరు మండలం బమ్మిడి ప్రాథమిక పాఠశాల, శ్రీకాకుళం అర్బన్‌లోని ఏవీఎస్ఎం స్కూల్ ఎంపికయ్యాయి. గత నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జిల్లా, రాష్ట్ర, అంగన్‌వాడీకో లొకేటెడ్ సభ్యులు పాఠశాలలను పరిశీలించినట్లు తెలిపారు. జిల్లాలో పలు పాఠశాలలను సందర్శించి మూడు పాఠశాలలను ఎంపిక చేశారన్నారు. ఈ పాఠశాలలో 2016–27 విద్యాసంవత్సరం నుంచి ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీలో భాగంగా విద్యార్థులు పూర్తిస్థాయి నైపుణ్యం సాధించడమే లక్ష్యంగా విద్యా బోధన, పూర్తి వసతి సౌకర్యాల కల్పన, అవసరమైన మెటీరియల్ వస్తుందన్నారు. సర్పంచ్ బి.లలిత మాట్లాడుతూ బడి ఈడు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో బి.ఎర్రన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పప్పు లక్ష్మి, ప్రధాన ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అర్జున్ పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం



బొడ్డపాడులో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

పలాస: ఉద్దానం ప్రజల ఆరోగ్య భద్రతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అందుకే అన్ని గ్రామ పంచాయతీల్లో ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చెప్పారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో శుక్రవారం రూ.17.5లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను మంత్రి ప్రారంభించారు. అలాగే బొడ్డపాడు ఎస్సీ వీధిలో కమ్యూనిటీ భవనాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి జరిగిందని వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఉంగ సాయికృష్ణ, సర్పంచి తామాడ మదన్, ఎంపీటీసీ మద్దిల పాపారావు, రెండికోట పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు యువకుడు మృతి



శంకరరావు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ పాతపొన్నాడ గ్రామంలో జరిగిన విద్యుత్ షార్టు సర్క్యూట్ ప్రమాదంలో గంగు శంకరరావు (29) మృతి చెందాడు. తాను నిర్వహిస్తున్న ఇటుక బట్టీల వద్ద మోటార్ పాడవ్వటంతో మరమ్మతులు చేస్తుండగా, షార్ట్ సర్క్యూట్ అయ్యి షాక్ కొట్టడంతో ఒక్కసారిగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు ఆస్పత్రికి తీసుకు వెళ్లే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. శంకరరావు ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ స్థానిక స్మార్ట్ కెం పరిశ్రమలో వర్కర్‌గా చేస్తున్నారు. ఇదే పంచాయతీ బింగిపేట గ్రామానికి చెందిన పల్లవితో ఏడాది కిందట వివాహం జరిగింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. జీవనాధారం కోల్పోయిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.